
# చిరునామా!
# నీ చరిత్ర విలువెంత?



అరగంటనించి "కాఫీ- కాఫీ- అరుస్తున్నా వంటింట్లో నించి కాఫీ" అని నోరు పడిపోయేలా ఎలాంటి సమాధానం రావటంలేదు.




— ఎన్.ఆర్.నంది

సుధాకర్‌కి చిర్రెత్తుకొచ్చింది. చదువుతున్న పేపరు పట్టుకునే, లోపలికెళ్ళాడు.

బంగాళాదుంపలు తరుక్కుంటున్న నిర్మల, శబ్దం విని తలెత్తి చూళ్ళేదు!

"ఏం, చెవుడా? వినపట్టం లేదా-అరుస్తున్న అరుపులు?"

"ఇన్నాళ్ళూ లేని చెవుడు యిప్పుడెలా వస్తుందనుకున్నారు?" చిరాగ్గా అంది నిర్మల.

"మరి సమాధానం చెప్పవేం?"

"ఇష్టం లేక."

"ఏవిఁటి ఇష్టం లేకపోవడం? నేనా? కాఫీ చెయ్యడమా?"

"రెండూనూ."

"ఏం?"

నిర్మల కత్తిపీట పక్కకి నెట్టేసింది—

"చూడండి! మీక్కావాలంటే వంటింట్లోకొచ్చి కాఫీలే తాగుతారో, హార్లిక్సులే గుటకేస్తారో - అంతే గాని, అందరికీ, అస్తమానం కాఫీలూ- గీఫీలూ, టిఫిన్లూ- భోజనాలూ అంటే నేనిక చెయ్యలేను" అని చిరాగ్గా లేచిపోయింది.

సుధాకర్ గతుక్కుమన్నాడు- 'స్నానం చేస్తున్న దయానిధి ఈ మాటలు వింటే....?'

సుధాకర్ సిగ్గుపడిపోయాడు.

"ఎవడిచ్చాడే బాబు నీ కింత నోరు! కాస్త మెల్లగా మాట్లాడు. అవతల దయానిధి స్నానం చేస్తున్నాడు!"

"అయితే?" అని, మరింత కంఠం హెచ్చించి, అతనికి వినబడాలనే గట్టిగా అరిచింది—

"చుట్టం అంటే ఒకటి రెండ్రోజులు. కాని, యిలా నెలల తరబడి కొంపలో పడి తింటూ వుంటే, ఇంతమందికి నేను వండి వడ్డించలేను. నేనూ మనిషినే!"

"కాదని ఎవరన్నారు? కాస్త కంఠం తగ్గిస్తే నీ సొమ్మేం పోదుగా? అదీగాక వాడేం నాకు పైవాడా? చిన్నప్పటినుంచి ఒక్కదగ్గర కలసి మెలసి తిరిగిన ప్రాణస్నేహితులం...."

"ఆ ప్రాణస్నేహాలు మీక్కాని నాక్కాదుగా? కావాలంటే మీరే ఇక నించి వండి తినండి" అని ఓ కప్పు కాఫీ సుధాకర్ ముందు కుదేసింది.

యాంత్రికంగా సుధాకర్ కప్పు అందుకున్నాడు. యాంత్రికంగానే తాగడం మొదలు పెట్టాడు.

బాత్‌రూమ్ లోంచి తల తుడుచుకుంటూ, లోపలికి వెళ్ళిపోతున్నాడు దయానిధి.

సుధాకర్ చప్పున అతనికి కనపడకుండా కాఫీ కప్పుని దాచేసి, వీపు అటు వేపుకి తిప్పేసుకున్నాడు!

అలా చేస్తూ సుధాకర్ ఎంత బాధ పడ్డాడో? తనింట్లోనే తాను, ప్రాణస్నేహితుడిముందు దొంగలా

ప్రవర్తించాల్సి వచ్చింది.

అతనికి సాధారణంగా కోపం రాదు. ఎప్పుడూ రాలేదు యింతకు ముందు. కాని యిప్పుడు తన మీద తనకి అసహ్యమే కాకుండా, నిర్మల మీద ఆపుకోలేనంత ఆగ్రహం ముంచు కొచ్చింది. తాగుతున్న కాఫీని ఆమె ముఖాన్నేపి కొట్టెయ్యాలనుకున్నాడు.

కాని తమాయించుకుని, నిశ్శబ్దంగా కాఫీని, కషాయంలా తాగేసి హాల్లోకి వచ్చాడు.

అప్పటికే దయానిధి బట్టలు కట్టుకుని బయలుదేరి పోతున్నాడు.

"ఎక్కడికిరా దయా?" అన్నాడు మెల్లగా సుధాకర్.

"అలా ఓ సారి బజారుకెళ్ళి పది నిమిషాల్లో వచ్చేస్తాన్రా: పదే నిమిషాలు."

అంటే, వాడు హోటల్‌కి వెళ్తున్నాడన్న మాట! నిర్మల అరుపులు వాడికి స్పష్టంగానే విని పించి వుండాలి. వాడు కాఫీ లేంది ఓ అరగంట కంటే ఎక్కువ బతకలేడు. రోజుల తరబడి తిండి లేకపోయినా సగటు భారతీయుళ్ళా బ్రతికెయ్యగలడు! కానీ, కాఫీ లేక పోతే, బ్రిటిష్ వాళ్ళలా నిలవ లేడు.

నిర్మల, సుధాకర్‌కి అర్ధాంగి అయినప్పటినుంచి అతన్లో పూర్తి భాగం అయిపోయింది. కానీ, చిన్ననాటి నించీ ఒక్క చోటనే పెరిగి, తిరిగి, చదివిన సుధాకర్, దయానిధులు ఒకే ప్రాణంలా బ్రతికారు. ఇప్పుడూ అలానే జీవించాలని సుధాకర్ ఆశ!

సుధాకర్‌కి తండ్రి గడించి పోయిన ఆస్తి వుంది గాబట్టి, కష్ట మంటే ఏమిటో తెలీకుండా బ్రతి కాడు. బి.ఏ. కూడా మామూలు గానే పాసై పోయాడు.

దయానిధికి తండ్రి- ఒక చిన్న పెంకుటిల్లుని, భార్యని, ముగ్గురు పెళ్ళికాని కూతుళ్ళని, ఒక చిన్న కొడుకునీ వొదిలి పోయాడు. ఆయన కొచ్చిన ప్రావిడెంట్ ఫండూ, కొద్దిపాటి ఇన్‌ష్యూరెన్సూ అప్పులాళ్ళు ఎగరేసుకుపోయారు. పెంకుటిల్లు దయానిధి చదువుకి కరిగిపోయింది!

సుధాకర్‌కి ఆ బాధలేదు. అందరి పిల్లలకీ పెళ్ళయ్యాకే అతని తండ్రి పైకెళ్ళిపోయాడు. ప్రావిడెంట్ ఫండూ, ఇన్‌ష్యూరెన్సూ బాగానే వచ్చాయి. వాటితో ముందు ఏదన్నా వ్యాపారం మొదలెడదా మని, ట్రయల్‌గా ఫాన్సీషాపూ, బియ్యం దుకాణం మూడు నాలుగు నెలలు నడిపి. చేతులు సగం కాల్చు

కున్నాడు. దాన్లో రాణించనని తెలుసుకుని, వుద్యోగ ప్రయత్నాలు చేశాడు.

సుధాకర్‌కి ఉత్తరాలిచ్చే బంధు వర్గం మంత్రివర్గంలో లేరు. అందువల్ల దక్షిణ సమర్పించుకుని పశ్చిమ బెంగాల్‌లో 'మంచి' ఉద్యోగమే సంపాయించు కున్నాడు.

దయానిధి యూనివర్సిటీలో ఫస్ట్‌క్లాసులో, ఫస్టన పాసై, గోల్డ్ మెడల్ సంపాయించినా, దాన్ని చూసి- అదే ప్రభుత్వం 'ఉద్యోగమా- గిద్యోగమా' అంటూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల నించీ తరిమి తరిమి కొట్టింది. ఒక్కోసారి పుడ్బాల్లా తన్నిపారేసింది.

దయానిధి, విశ్వవిద్యాలయంలో అగ్రగణ్యుడనిపించుకున్నా, అతను అగ్ర వర్ణస్తుడూ కాడు, వెనకబడిన తరగతుల వాడూ కాడు. 'పోసీ కుక్కలా బతుకుతాను- షెడ్యూల్డ్ ట్రైబ్‌కింద, 'షెడ్యూల్డ్ ఏనిమల్' అనే మరో కొత్త కులాన్ని సృష్టించి, ఉద్యోగం ఇవ్వండీ' అని ఎవర్నీ బతిమాలలేదు. ఓటు వేసిన రోజున, జంతువు గుర్తు ఎవరికి కేటాయించబడిందో, ఆ అభ్యర్థికి కూడా ఓటు ముద్ర కొట్ట లేదు.

దయానిధిలానే సుధాకర్ కూడా అగ్రవర్ణస్తుడూ కాడు, షెడ్యూల్డ్ కులాల వాడూ కాడు. అయినా ఏ మహానుభావుడి సలహా మీదనో దక్షిణ యిచ్చి, షెడ్యూల్డ్ కాస్ట్ సర్టిఫికేట్ సంపాయించాడు. తర్వాత, రిజర్వేషన్ ఈ తరగతి వారికి వున్నా, మళ్ళీ మరికొంత దక్షిణ యిచ్చుకుని, ఉద్యోగం సంపాయించుకున్నాడు.

అప్పుడే దయానిధిని బ్రతిమాలాడు సుధాకర్-

"ఓరే! ఒక షెడ్యూల్డు కాస్ట్స సర్టిఫికేట్ సంపాయించుకోరా! ఇంటర్‌వ్యూ వస్తే అప్పుడు కూడా నేను దబ్బిస్తాను" అని.

దయానిధి నవ్వాడు.

"మీలాంటి వాళ్ళున్నంతవరకూ ఈ దేశం బాగుపడదు సుధాకర్!" అన్నాడు దయానిధి.

"మనం బ్రతకాలి కదరా?"

"బ్రతికించే వాళ్ళనే తీసుకొద్దాం."

"ఈ జన్మలో సాధ్యం కాదు. నీ ఒక్కడికే కాదు కదా- లక్షల మంది అలాంటి బ్రతికించే వాళ్ళను తీసుకొచ్చినా- ఈ వ్యవస్థ మారదు."

అతను నవ్వే సమాధానంగా

సుధాకర్ భుజం తట్టాడు.

దయానిధి చదువులో గోల్డు మెడలిస్టే కాదు-కవి, రచయిత, నాటక కర్త, నటుడు, పాటలు రాగయుక్తంగా పాడగలడు. అయితే అతను కవిత్వం, కథలు, నాటకాలూ ఎవరికోసం రాస్తున్నాడో, వారికి చదివి, విని, చూసే ఓపికా లేదు, తీరుబాటూ లేదు. వాళ్ళ భుక్తికోసం తాపత్రయ్యం పడే సరికే వారి కాలం సరిపోతుంది. వీటిని చదివి, వినే ఓపిక ఎక్కడుంటుంది?

అతను కూడా సుధాకర్‌లానే కోపిష్టి కాడు. అయితే అతన్ని కొడితే కొంత ఆలోచించేవాడు. ఎదుటి వాడిని కొడితే, వాడెవడైనా సరే ఎదుర్కొనే వాడు. అందువల్ల పోలీసులకు పరిచయస్తుడే. కాని అతని పరిచయం పోలీసుల వరకే. కోర్టు దాకా వెళ్ళేది కాదు- జైల్లోకి తోసేవారూ కాదు.

ఉద్యోగం ఎలాగోలా సంపాదించుకొని, నాలుగురాళ్ళు తెచ్చి, తనమీద ఆధారపడిన వాళ్ళకింత పెట్టి బ్రతకడం స్వార్థం కాదు. అయినా దయానిధి ఎందుకో 'ఇలాంటి' ఉద్యోగాల కోసం, ఎవరి కాళ్ళూ పట్టుకునేవాడు కాదు. అయినా ఉద్యోగాల కోసం, ప్రయత్నాలు 'మంచి మార్గంలోనే' చేసే వాడు.

చాలాకాలం అతను రిక్షాలు తొక్కాడని ఎవరికీ తెలియదు. పడవల రేవుల దగ్గర బస్తాలు మోసేవాడు. ఇదీ ఎవరికీ తెలీదు: బేరేజీల దగ్గరా, ప్రాజెక్టుల దగ్గరా చిన్న చిన్న పనులు చేసేవాడు. ఇంకా ఇంకా చాలా 'నీచమని' మామూలు జనం అనుకునే పనులు చేశాడు- చదువులో గోల్డు మెడల్ పొందిన దయానిధి.

ఈ సమయంలోనే అతనికి తిండి మీద ధ్యాస తగ్గింది. టీ నీళ్ళతోనో, కాఫీతోనో కడుపు నింపుకునే వాడు.

ఈ పనులు చేయడం వల్ల చాలా చాలా 'లోకం' - చూసి చూసి- చాలా చాలా నిజాలని తెలుసుకున్నాడు.

కష్టపడి, కష్టపడి, కష్టపడి- ఏదో ఒక ప్రాజెక్టునో, ఫ్యాక్టరీనో, మరో బేరేజ్‌నో కట్టిన వారికి కూలి డబ్బులుగా ఎంత ఇచ్చేవారో ఆ 'పని' పూర్తయ్యాక, ఏ నాయకుడో వచ్చి దాన్ని ప్రారంభించడానికి 'దాదాపు' అంతా ఖర్చయేది: దయానిధి అదీ తెలుసుకున్నాడు.

రోడ్లనీ, స్కూళ్ళనీ, చిన్న చిన్న ప్రభుత్వపు బిల్డింగులనీ

కట్టడం, ప్రభుత్వమే చేపట్టకుండా, ఓ మధ్యవర్తికి అప్ప చెప్పేది. ఆ కాంట్రాక్టర్ కూడా, ఉత్తర మహత్యంతోనూ, దక్షిణ సమర్పణతోనూ ఆ కాంట్రాక్టు సంపాయించి, ఇచ్చిన డబ్బు సగం దాచుకుని, మాటలురాని మృగాల్లాంటి తోటి మనుషులకు వీలైనంత 'గడ్డి' తినమని పడేసి, ఆ రోడ్లూ, స్కూళ్ళూ, బిల్డింగులూ, చిన్న చిన్న బారేజీలూ కట్టిపారేసేవాడు.

దానిని పరీక్షించడానికి వచ్చిన ప్రభుత్వ ఇంజనీర్లూ, ఆఫీసర్లూ-కాంట్రాక్టర్ చాటుగా యిచ్చిన కరెన్సీతో నోరు మూసుకుని సంతకాలు పెట్టేసే వారు. అలా నోరు మూయకండా రిపోర్టు రాసే అధికారి ఎవరి బలంవల్లనో ఏదో ప్రదేశాలకి ట్రాన్స్‌ఫర్ అయిపోయే వాడు.

అప్పుడప్పుడు మర్డర్లు కూడా చేయబడేవారు. చిత్రంగా శవమూ మాయమయేది. పోలీసుశాఖ గాలించి గాలించి వొదిలేసేవారు.

ఇంకా ఇలాంటి 'మంచి' పనులు చాలా చాలా చాలా చూసి, దయానిధి గుండె 'ఏదోగా' మారిపోయింది. 'విజ్ఞానం' వికసించింది- అడవిలో పువ్వులా.

సుధాకర్‌కి అప్పుడప్పుడు, దయానిధి విషయాలు తెలుస్తూనే వుండేవి. కాని, అతని సరైన అడ్రస్ తెలీక, సంపాదించటానికి ప్రయత్నాలు చేసి, చేసి - చివరకి అతన్ని గుంటూరులో 'పట్టు కొన్నాడు.'

దయానిధి అప్పటికే చాలా పెద్ద కథకి కథానాయకుడై పోయాడు.

దయానిధి అక్కగారు- తనకిక పెళ్ళి కాదనో, లేక ఆకలి బాధ పడలేకనో ఆత్మహత్య చేసుకుంది.

తమ్ముడు క్షయతో ప్రభుత్వాసు పత్రిలో కన్ను మూసాడు.

రిక్షా తొక్కుతున్న దయానిధిని చూసి సుధాకర్ నిజంగా ఏడ్చేశాడు.

"నాతో వచ్చెయ్‌రా" అని బ్రతిమాలాడు.

"ఎందుకు?"

"అక్కడ కొన్ని వుద్యోగాలు వున్నాయి. ఒకటి నీకు సంపాయిస్తాను."

"అంత ఇన్‌ఫ్లూయన్స్ సంపాయించావా అక్కడ?"

"నేను సంపాయించడం కాదు. అక్కడికి కొత్తగా వచ్చిన ఇంజనీరూ, పి. ఆర్. ఓ. కుర్రాళ్ళు, చాకుల్లాంటి వాళ్ళు. తెలివికి చాలా విలువిచ్చే వ్యక్తులు. నువ్వు ఒక్క అప్లికేషన్ వేసేస్తే...."

ఇలా సుధాకర్ అతనికి చాలా చాలా బోధ చేశాడు.

అతన్నొప్పించి తీసికెళ్లేసరికి సుధాకర్‌కి తోక లేకపోయినా ప్రాణం అంతవరకూ వచ్చింది.

కాని అక్కడికి తీరా వెళ్లేసరికి చాకుల్లాంటి ఇంజనీరూ, పి. ఆర్. ఓ. పైవారి ఉత్తరాలకి లొంగిపోయారు. ముందు లొంగకుండా తెలివున్నవాళ్ళనే సెలక్ట్ చేశారు. అందులో దయానిధి కూడా సెలక్ట్ అయాడు.

కాని, వాళ్ళ పరీక్ష చెల్లదనో, లేదా మరో కారణం చూపించో, ఆ సెలక్టయిన అభ్యర్థుల జాబితాను రద్దు చేసేసారు.

ఇంజనీరునీ, పి. ఆర్. ఓ.నీ మరోచోటుకి బదిలీ చేసేస్తే, ఇద్దరూ రాజీనామాలు చేసేసి వెళ్ళిపోయారు.

'దేశంలో ఆత్మాభిమానం తలెత్తుతోందన్నమాట' అని దయానిధి మనస్ఫూర్తిగా ఆనందపడిపోయినా - 'ఇప్పుడేమిటి చెయ్యడం?' అనే ఆలోచన అతన్ని వేధించలేదుగాని, అతన్లో మరింత విప్లవాగ్నిని చెలరేగించింది.

మళ్ళీ వూరు వెళ్ళిపోవాలనుకున్నాడు.

కాని, సుధాకర్ ఒప్పుకోలేదు- 'కాలు కదిపితే నామీద ఒట్టు' అన్నాడు.

ఆ ఒట్టుకి దయానిధి తలొంచలేదు. కాని సుధాకర్ నిష్కల్మషమైన ప్రేమకి లొంగిపోయాడు. మూడు నెలలు అతని దగ్గర వున్నాడు.

పగలు సుధాకర్ 'పని'కి వెళ్ళిపోతే తన 'పని'మీద, వూరవతలకు వెళ్ళేవాడు.

దయానిధికి రానురాను స్నేహితులు ఎక్కువైపోయారని సుధాకర్ తెలుసుకున్నాడు. వాళ్ళంతా దయానిధిలాంటి 'విప్లవకారులే' అని కనిపెట్టినా, దయానిధికి ఎలాంటి వార్నింగూ యివ్వలేదు, పల్లెత్తుమాట అనలేదు.

ఒక రోజున అన్నాడు-

"దయా! నన్ను అపార్థం చేసుకోనంటే ఒక సలహా!"

"ఏవిటి?"

"అపార్థం చేసుకోకూడదు" అని మరోసారి అని - "ఇక్కడ కాజువల్ లేబర్‌లో ఖాళీలు వున్నాయి. ఖాళీలంటే ఖాళీలు కాదు - పుట్టిస్తాం. రోజుకి నాలుగు రూపాయలిస్తారు."

అతని మాటలు నోట్లోనే వున్నాయి, దయానిధి నవ్వాడు—

"ఇక్కడా కాంట్రాక్టర్లు వున్నారన్నమాట!"

"దేశమంతా ఒకటేగా-రాష్ట్రాలు వేరైనా? ఇంకా ఇది నయమనిపిస్తుంది. ఈ వర్క్‌షాప్ మనదే కదా?"

"మనదా?"

"అంటే ప్రభుత్వానిది! ప్రభుత్వం మనది కదా! అందుకని ఇదీ మనదే! ఇక్కడ క్లాస్‌ఫోర్త్ స్టాఫ్ అని ఒక భాగం వుంది. అంటే వాళ్ళు కూలీలతో సమానం. వాళ్ళ పని, కేవలం కూలిపని లాంటిదే. కాని వాళ్ళచేత, క్లాస్ థ్రీ స్టాఫ్ చేయాల్సిన పని చేయించి, ఔట్ టరన్ తీసుకుంటున్నారు. రూల్ ప్రకారం ఈ క్లాస్ ఫోర్త్ స్టాఫ్‌వారినించి 'అవుట్ టర్న్' తీసుకోకూడదు. కాని ఈ రూల్ కొందరికి తెలీదు, కొందరికి తెలుసు. అయినా ఏం చెయ్యగలరు? అవుట్ టర్న్ ఇవ్వమంటే, వీళ్ళని మరోవిధంగా తప్పు చేసినట్టు చూపించి - ఛార్జిషీట్‌లు ఇప్పిస్తారు. 'కడుపు బాధకి' భయపడి వాళ్ళు తలొంచుకుని ఔట్‌టర్న్ యిస్తూవుంటారు. ఇంత తక్కువ స్టాఫ్‌తో, ఇంత తక్కువ ఖర్చుతో ఇంత 'అవుట్‌టర్న్' చేయించినందుకు పైవాళ్ళకీ, అధికార్లకీ - వందలూ, వేలూ ప్రమోషన్లుయిచ్చి పై పోస్టులకు పంపిస్తున్నారు. ఎవరు? ఇది ప్రైవేట్ కంపెనీ కాదు. సాక్షాత్తు మనం ఎన్నుకున్న, మన ప్రభుత్వం కట్టించిన మన వర్క్‌షాప్! ప్రభుత్వాధికారులే ఇలాంటి స్వార్థంతో ఇలాంటి నీచమైన పని చేస్తుంటే, మామూలు ప్రైవేట్ కంపెనీలూ. సంస్థలూ, కాంట్రాక్టర్లు చేయటంలో వింతేముంది?" అని వివరించాడు సుధాకర్.

దయానిధి వింటున్నాడు, మాట్లాడలేదు.

చాలాసేపు మౌనంగా వున్న తర్వాత అన్నాడు—

"దీనికంటే రిక్షా తొక్కడమే మంచిదేమో! అఫ్‌కోర్స్ ఆ రిక్షా లిచ్చేవాడు కూడా ఒక రకం కేపట లిస్టే అనుకో, కాని అందులో హాయివుంది."

"రిక్షా తొక్కడంలో హాయుందా?" ఆశ్చర్యంగా అన్నాడు సుధాకర్.

"అఁ! నీకు చెప్పినా అర్థం కాదు. నేను రేపే గుంటూరు వెళ్ళిపోతా" అన్నాడు దయానిధి నిశ్చయంగా.

సుధాకర్ గతుక్కుమన్నాడు-

"నా ముఖం చూసి చెప్పు! నువ్వు నిజంగా రిక్షా తొక్కి బతకడానికే వెళ్తానంటున్నావా? లేక మొన్న నిర్మలన్న మాటలకి బాధపడి...."

దయానిధి చప్పున అతని చేతులు పట్టుకున్నాడు—

"సుధా- సుధా! అంత మాటనకురా! నిజంగానే రిక్షా తొక్కాలనే వెళ్ళిపోతున్నాను. ఆ నిర్ణయం-మా సెలక్షన్ లిస్ట్ కాన్సిల్ చేసినపుడే నిశ్చయించుకున్నాను. కాని నువ్వు బలవంతం చేయటంవల్ల కాదనలేక, యిన్నాళ్ళూ వున్నాను" అని ఒక క్షణం ఆగి అన్నాడు—

"సుధా! మన స్నేహాలనీ, ప్రేమల్నీ, మమతల్నీ, అనుబంధాలని కూడా విచ్ఛినం చేసేసి - మిత్రత్వాలనీ, బంధుత్వాలని కూడా నాశనం చేసి పారేస్తున్న దెవరంటావ్?"

సుధాకర్ మాట్లాడలేదు. మాట్లాడలేకపోయాడు.

"దయామయిలాంటి 'నిర్మలలు' కాదురా! మన ఆర్థిక పరిస్థితి, ఆర్థిక దుస్థితి, ఆర్థిక అసమానత్వం! మానవత్వాన్ని క్షణక్షణానికీ చంపి పారేస్తున్న ఈ 'రూపాయి!' దీని విలువ అందరికీ ఒకేలా కనిపించేలా చేస్తే - మనిషి మనిషిని కొంతగాకపోతే కొంతయినా అసహ్యించుకోవడం మానేస్తాడు. మెల్లమెల్లగా ప్రేమించడం నేర్చుకుంటాడు. అప్పుడు 'మనం' 'మనం'గా బ్రతగ్గలంరా."

సుధాకర్ ఏం అనలేకపోయాడు.

లోకాన్ని చూసినవాడూ, లౌక్యం తెలిసినవాడూ!

అయినా వాదించలేదు. వాదించలేకపోయాడు.

కారణం ఒకటే!

దయానిధి లోకాన్ని అనుభవపూర్వకంగా చూశాడు. అన్యాయాలకి లోనయ్యాడు. గోల్డ్ మెడల్ యిచ్చినవారి చేతుల్లోనే నలిగి

పోయాడు.

అతను కథలు వినడమే కాదు, అతనే ఓ పెద్ద కథ.

వ్యవస్థ మారాలంటాడు. మనిషి ఎదగాలంటాడు, స్వార్థం పోవాలంటాడు.

ఇది సాధ్యమా?

ప్రపంచంలో మనిషి, నియాండర్‌తల్ మానవుడిగా వున్నప్పటి నించీ ఈ కొట్టుకోవడాలూ, స్వార్థాలూ, ఈర్ష్యలూ, 'నీ' 'నా' భేదాలు వున్నాయి.

ఇంత కాలం జరిగి,

ఇన్ని వేల యుద్ధాలు జరిగి,

ఇన్ని లక్షలమంది అమాయకులు బలైపోయినా - 'మనిషి' 'బ్రతకగలుగుతున్నాడా?' 'సుఖించగలుగుతున్నాడా''ఆనందించగలుగుతున్నాడా?'

ఇప్పుడు మానవుడు సుఖంగా వున్నాడూ అనుకుంటే అది రాజీ! జీవితంతో రాజీ! లోకంతో రాజీ! కుటుంబంతో రాజీ! మనుషులతో రాజీ! భయంవల్ల రాజీ!

రాజీలు ఎంతో కాలం నిలవ్వని చరిత్రే చెబుతోంది!

మనిషిని 'సుఖపెట్టడానికి' ఎప్పటినించో మహా చక్రవర్తులూ, రారాజులూ, రాజులూ ప్రయత్నాలు చేశారు.

రోడ్లు వేయించారు. పక్కన చెట్లు నాటించారు. చెరువులు తవ్వించారు. వైద్యశాలలు కట్టించారు.

కానీ—

అదే రోడ్ల మీంచి లక్షల సైన్యాల్ని నడిపించారు.

అలసటచెందినపుడు, చెట్లకింద విశ్రమించారు.

చెరువుల్లో నీళ్ళు తాగారు.

ఆ సైనికులకు రోగాలు వస్తే, అవే వైద్యశాలలు వాళ్ళని తిరిగి ఆరోగ్యవంతులుగా చేసి, అవే రోడ్ల మీంచి, అవే చెట్ల నీడల్లో నడిపించాయి.

వాళ్ళు వెళ్ళి, మిగతా రాజ్యాల మీద విరుచుకు పడ్డారు!

లక్షల, లక్షల మందిని హతమార్చారు.

వాళ్ళ రాజ్యాలని దొంగల్లా- ఈ మహా చక్రవర్తులు ఆక్రమించారు.

ఈ రోడ్లూ, చెట్లూ, చెరువులూ, వైద్యశాలలూ ఎవరికి?

నిజానికి 'మనుషులకే.'

కాని, ఏ మనుషులకు?

మనుషుల్లాంటి దొంగలకూ, నరహంతకులకూ, చక్రవర్తుల రాజ్య విస్తరణకూ!

ఆనాటి నించి ఈనాటి వరకూ, ఈ విధానాల్లో మార్పేవన్నా

వుందా?

వుంది!

మరో పేపర్లో వుంది!

కాని విధానం, ఫలితం ఒక్కటే! పేర్లు మాత్రం మార్చారు.

ఇదీ దయానిధి వాదన.

ఇన్ని లక్షల సంవత్సరాలనించి సాంప్రదాయకంగా విడవకండా వస్తున్న ఈ వ్యవస్థా విధానం కేవలం ఒక్క దయానిధి వల్ల-ఒక్కసారిగా మారిపోతుందా?

మారదని అతనే ఒప్పుకుంటు న్నాడు!

కాని, కొన్ని తరాలకైనా మారు తుందని దయానిధి గాఢాభిప్రాయం!

దయానిధి వెళ్ళిపోయిన రెండేళ్ళ తర్వాత, ఒక ఆంగ్ల పత్రికలో ఒక ఫోటో పడింది. అది ఫోటోయే అనాలి-ఫోటోలా వుంది గాబట్టి!

రెండు తలలు విడివిడిగా పడి వున్నాయి. రెండు తలలకూ కళ్ళు లేవు.

తీసేసారా? ఎవరికైనా ధర్మం చేశారా? ఎవరు ఎందుకు చేశారు? ఎందుకు చేసి వుంటారు?

అడవుల్లో ఇద్దరు విప్లవకారుల్ని పోలీసులు కాల్చేశారు—అని వివ రాల్లో రాసి వుంది—కొద్దిగా.

వాళ్ళకీ, పోలీసులకూ మధ్య జరిగిన సాయుధ పోరాటంలో ఇద్దరూ చచ్చిపోయారని, కొన్ని దినాల తర్వాత ప్రకటించారు. పోలీసుల మీద కాల్పులు జరిపితే, ఆత్మరక్షణకు పోలీసులు ఎదురు కాల్పులు జరిపారట!

పత్రిక ఆ ఫోటోలను ఎలా సంపాయించిందో?-ఎంత ధైర్యంగా ప్రచురించింది!!

వాళ్ళలో ఒక తల పురుషుడిది, మరోటి స్త్రీది. పోలికలు దొరక లేదు—వికృతంగా వుండటంవల్ల.

కాని. ఆ మగతలగల 'మనిషి'-కవి అట! రచయితట! నాటక కర్తట! పాటలు కూడా పాడగల డట! రిక్షావాడట!

ఆ ఆడతల. స్త్రీది! ఆమె ఎవరు?

'మైగాడ్! గోల్డ్ మెడలిస్ట్ దయా నిధిచెల్లెలా?'— సుధాకర్ ఫోటో తలల్ని చూసి వలవలా ఏడ్చేశాడు. 'దయానిధీ! చరిత్రలో నీ చిరు నామా ఏమని రాస్తారు పైతరాల వాళ్ళు? అసలు నీ 'చిరు' నామా ఏమిటి? నీ చరిత విలువెంత దయానిధీ? నీ చిరునామా చరిత ఖరీదెంత? ఎవర్రా, దాని విలు వనూ, ఖరీదునీ కట్టగలడు? ఎవడు కడతాడు? ఎప్పుడు? అప్పటివరకూ నేను బ్రతికుండగలనా భగవం తుడా?' అంటూ పత్రికను కన్నీ టితో తడిపేశాడు.

తడిచిపోయిన పత్రిక 'హేండ్ మేడ్ పేపర్ మిల్లు' కి పోయింది!*